టైటిల్ అదేనా?

'దేవర' చిత్రంతో అపూర్వ విజయాన్ని అందుకున్నారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఆయన హిందీ చిత్రం 'వార్-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. హృతిక్‌రోషన్ మరో కథానాయకుడిగా నటిస్తున్న ఈ మల్టీస్టారర్‌పై పాన్ ఇండియా స్థాయిలో ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా తర్వాత ప్రశాంత్‌నీల్ డైరెక్ట్ చేయబోయే ప్రాజెక్ట్‌లో జాయిన్ కాబోతున్నారు ఎన్టీఆర్. ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎన్టీఆర్‌ను అత్యంత శక్తివంతంగా ఆవిష్కరిస్తూ ప్రశాంత్‌నీల్ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని చెబుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సినిమా టైటిల్‌ను సంక్రాంతి సందర్భంగా వెల్లడించనున్నారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమాకు 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. చిత్ర బృందం కూడా ఇదే టైటిల్‌ను ఖరారు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా టైటిల్ సస్పెన్స్ వీడాలంటే సంక్రాంతి వరకు ఆగాల్సిందే. ఫిబ్రవరి లేదా మార్చిలో షూటింగ్ మొదలుకానుందని సమాచారం.

నిన్ను నువ్వు నమ్ముకో..

ప్రపంచమంతా నిన్ను నమ్మకపోయినా ఫర్వాలేదు. నిన్ను నువ్వు నమ్ముకో.. అనే కాన్సెప్ట్‌తో అజిత్ తమిళంలో నటిస్తున్న యాక్షన్ అడ్వంచర్ 'విడాముయర్చి'. మగిళ్ తిరుమేని దర్శకుడు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్స్ దశలో ఉంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అజిత్‌ని డిఫరెంట్ మాస్ అవతార్‌ని ఈ టీజర్‌లో చూడొచ్చు. టీజర్‌ని గమనిస్తే.. అజిత్ దేనికోసమో అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో విలన్స్ భరతం పడుతున్నారు. తాను సాధించాల్సిన లక్ష్యం కోసం ఏం చేయటానికైనా, ఎంతదూరం వెళ్లటానికైనా వెనుకాడని వ్యక్తిగా ఇందులో అజిత్ కనిపిస్తారని, 'మంగాత' తర్వాత మళ్లీ అజిత్, అర్జున్, త్రిష కలిసి నటిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రంలో ఆరవ్, రెజీనా కసాండ్ర, నిఖిల్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఓంప్రకాష్, సంగీతం: అనిరుద్.

వచ్చే నెలలో లగ్గం

ఇటీవలే తన రిలేషన్‌షిప్ స్టేటస్‌పై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా క్లారిటీనిచ్చింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. చిరకాల స్నేహితుడు ఆంటోనితో ప్రేమలో ఉన్నానని, ఇక జీవితాంతం తమ బంధం కొనసాగుతుందని వెల్లడించింది. దీంతో ఈ భామ పెళ్లిపీటలెక్కేందుకు సిద్ధమవుతున్నదని అభిమానులు భావించారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కీర్తి సురేష్ అక్కడే తన పెళ్లి వివరాలను తెలియజేసింది. వచ్చే నెలలో గోవాలో పెళ్లి చేసుకోబోతున్నానని చెప్పింది. తన తాజా హిందీ చిత్రం 'బేబీ జాన్' త్వరలో విడుదలకానుందని, అందుకే స్వామివారిని దర్శించుకున్నానని కీర్తి సురేష్ పేర్కొంది. దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరైన కీర్తి సురేష్ 'బేబీ జాన్' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నది. వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది.

సుకుమార్ లేకపోతే నేను లేను

'నన్ను 'ఆర్య'తో స్టార్‌ని చేసింది సుకుమార్. ఈ రోజు నేను సక్సెస్‌ఫుల్ హీరోగా ఉన్నానంటే కారణం సుకుమార్. నా ఎదుగుదలకు కారణం ఆయనే. ఇంత వేడుక జరుగుతున్నా ఆయన రాలేదు. ఇంకా సినిమా పనుల్లోనే బిజీగా ఉన్నారు. ఇన్ని డబ్బులొస్తాయి. ఇంత పేరొస్తుంది అని లెక్కలేసుకొని చేసిన సినిమా కాదది. ప్రేక్షకులకు ఓ బెస్ట్ ఇవ్వాలి, గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలి అని చేసిన సినిమా. 'పుష్ప2' బిగ్గెస్ట్ ఇండియన్ సినిమా అయ్యిందంటే కారణం మీ ఆదరణే.' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'పుష్ప 2'. బ్లాక్‌బస్టర్ 'పుష్ప'కు సీక్వెల్‌గా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదల కానుంది. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్లను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ముంబయ్‌లో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో బన్నీ మాట్లాడారు. అయిదేళ్ల ప్రయాణం 'పుష్ప'తో స్పెషల్ బాండింగ్ ఏర్పడేలా చేసిందని, బన్నీకి జోడీగా నటించడం, సుకుమార్ లాంటి జీనియస్‌తో పనిచేయడం గొప్ప అనుభవమని కథానాయిక రష్మిక మందన్నా తెలిపారు. ఇంకా నిర్మాతలు కూడా మాట్లాడారు.

రెడీ టూ యాక్షన్

అగ్ర నటుడు బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ సినీ అరంగేట్రానికి రంగం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. నందమూరి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్న మోక్షజ్ఞ తొలి చిత్రానికి 'హనుమాన్' ఫేమ్ ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహించబోతున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. మోక్షజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా ప్రకటన వెలువడింది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. పౌరాణిక ఇతిహాసం ప్రేరణతో రూపొందించిన ఈ కథలో మోక్షజ్ఞ పాత్రను నవ్యరీతిలో తీర్చిదిద్దబోతున్నారని తెలిసింది. ఇప్పటికే నటన, నృత్యాలు, పోరాటఘట్టాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన మోక్షజ్ఞ, లుక్స్, స్టైల్ పరంగా సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మోక్షజ్ఞ కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన ఛార్మింగ్ లుక్స్‌తో కనిపిస్తున్నారు. నందమూరి అందగాడి స్టైల్ అదిరిపోయిందంటూ అభిమానులు ఈ ఫొటోపై కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. మోక్షజ్ఞ సోదరి తేజస్విని సమర్పకురాలిగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

నటి సమంతకు పితృవియోగం

అగ్ర నటి సమంత పితృవియోగానికి గురయ్యారు. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు శుక్రవారం చెన్నైలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. జోసెఫ్ ప్రభు తెలుగు ఆంగ్లో ఇండియన్ కుటుంబానికి చెందినవారు. 1986లో నీనెట్ ప్రభుతో ఆయనకు వివాహం జరిగింది. 87లో వారికి సమంత జన్మించారు. భార్య నీనెట్ ప్రభుతో కలిసి ఆయన చెన్నైలోనే నివాసం ఉంటున్నారు. జీవితంలోని ప్రతి మలుపులో తన తండ్రి తనకు తోడుగా నిలిచారని, తన ఎదుగుదలలో ఆయన పాత్ర కీలకమని పలు ఇంటర్వ్యూల్లో సమంత పేర్కొన్న విషయం విదితమే. తండ్రి మరణంతో సమంత తీవ్ర విషాదంలో మునిగిపోయారు. 'మనం మళ్లీ కలిసే వరకు.. నాన్న..' అంటూ హృదయం కదిలించే క్యాప్షన్‌తో ఓ ఫొటోను సమంత తన సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. ఈ వార్త తెలియడంతో అభిమానులు, సినీ ప్రముఖులు సమంతకు తమ సంతాపాన్ని తెలియజేస్తున్నారు.

వడ్డీతో సహా తిరిగొస్తుంది!

దక్షిణాది సినీరంగంలో నయనతార-ధనుష్ మధ్య నెలకొన్న వివాదం హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే నయనతార జీవితం ఆధారంగా రూపొందించిన 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో మొదలైన వివాదం మరింత జటిలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కర్మ సిద్ధాంతాన్ని ఉదహరిస్తూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో నయనతార పెట్టిన పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'కర్మ సిద్ధాంతం ఏం చెబుతుందంటే.. అబద్ధాలతో పక్కవారి జీవితాన్ని నువ్వు ధ్వంసం చేస్తే.. దానిని ఓ అప్పుగా భావించు. అది సరైన సమయంలో వడ్డీతో సహా నీ దగ్గరకే వస్తుంది' అంటూ నయనతార తన పోస్ట్‌లో పేర్కొంది. ధనుష్‌ను ఉద్దేశించే ఆమె ఈ పోస్ట్‌ను పెట్టిందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇక ధనుష్-నయనతార వివాదం పూర్వపరాల్లోకి వెళితే.. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీలో నయనతార నటించిన 'నానుమ్ రౌడీ దాన్' సినిమా వీడియోలను కొన్నింటిని వాడుకున్నారు. ఈ సినిమా సమయంలో దర్శకుడు విఘ్నేష్‌శివన్‌తో ప్రేమలో పడింది నయనతార. అందుకే ఆ సినిమా క్లిప్స్‌ను తన డాక్యుమెంటరీలో ఉపయోగించుకోవాలని భావించింది నయనతార. అందుకు చిత్ర నిర్మాత ధనుష్ నుంచి అనుమతి లభించలేదు. మూడు సెకన్ల పాటు వాడిన వీడియో క్లిప్‌ను తీసివేయాలని, లేకుంటే పరిహారంగా 10కోట్లు చెల్లించాలని నయనతారకు ధనుష్ లీగల్ నోటీసులు పంపించాడు. దీనితో ఆగ్రహం చెందిన నయనతార.. ధనుష్ తీరును తప్పుబడుతూ ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది. అక్కడ మొదలైన వివాదం ధనుష్ వరుసగా ఇస్తున్న కోర్టు నోటీసులతో ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పరోక్షంగా ధనుష్‌ను ఉద్దేశించి నయన్ ఈ పోస్ట్ పెట్టిందని చెన్నై సినీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

డైరెక్టర్‌గా విజయ్ తనయుడు

తమిళ అగ్ర నటుడు విజయ్ సినిమాలకు కామా పెట్టేసి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తే.. ఆయన తనయుడు జాసన్ సంజయ్ డైరెక్టర్‌గా సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. సందీప్ కిషన్ కథానాయకుడిగా లైకా సంస్థ నిర్మిస్తున్న చిత్రానికి ఆయన దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం లైకా సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఓ మోషన్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. 'జాసన్ సంజయ్ కథ, ఆయన నరేషన్ నచ్చి ఈ సినిమా చేస్తున్నాం. ఇది పానిండియా పాయింట్. మనం ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతకాలి అనేది మనం చాలా సందర్భాల్లో విన్నమాట. కానీ దానికోసం మనం ఎంత వెచ్చిస్తామనేదే ఈ సినిమా ప్రధానాంశం. థమన్ సంగీతం అందించబోతున్నారు. ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని లైకా ప్రొడక్షన్స్ హెడ్ జికేఎం తమిళ్ కుమరన్ చెప్పారు.

డిసెంబర్‌లో 'ప్రణయగోదారి'

సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రణయగోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీఎల్‌వి క్రియేషన్స్ పతాకంపై పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. డిసెంబర్ 13న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో సాయికుమార్ కీలకమైన పాత్రను పోషిస్తున్నారని, ఆయన నటన ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. గోదావరి నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథా చిత్రమని, ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ, దర్శకత్వం: పీఎల్ విఘ్నేష్.

ఇలాంటి కేరక్టర్‌ని ఎవరూ ఊహించరు

'గంగూభాయ్ కతియావాడీ' తర్వాత సంజయ్‌లీలా బన్సాలీ దర్శకత్వంలో అలియాభట్ చేస్తున్న సినిమా 'లవ్ అండ్ వార్'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతున్నది. అలియా, విక్కీ కౌశల్‌పై కీలక సన్నివేశాలను బన్సాలీ తెరకెక్కిస్తున్నారు. రణబీర్ కపూర్ ఇందులో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా గురించి ఇటీవల అలియా మీడియాతో మాట్లాడింది. 'లవ్ అండ్ వార్' ఓ పిరియాడిక్ డ్రామా. ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే పనిలో ఉన్నారు సంజయ్‌లీలా బన్సాలీ. ప్రేక్షకుల్ని కొన్ని దశాబ్దాల వెనక్కి తీసుకెళ్లనున్నారాయన. ఆయన దర్శకత్వంలో మళ్లీ నటించడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర డిఫరెంట్‌గా ఉంటుంది. ఇలాంటి కేరక్టర్‌ని ఎవరూ ఊహించరు. నటిగా నాలోని కొత్తకోణాన్ని 'గంగూభాయ్' ఆవిష్కరించింది. అలాగే ఈ సినిమాలో కూడా కొత్త అలియాను చూస్తారు. 2026 మార్చి 20 వరకూ వెయిట్ చేయండి.' అంటూ చెప్పుకొచ్చింది అలియాభట్.

'వికటకవి' ఓ కొత్త అనుభవం

'వికటకవి' వంటి పీరియాడిక్ బ్యాక్‌గ్రౌండ్ సిరీస్‌కు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేయడం ఛాలెంజ్‌గా అనిపించిందని, ఈ సిరీస్ కోసం ఎంతో పరిశోధన చేశానని చెప్పింది గాయత్రి దేవి జోశ్యుల. ఆమె కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేసిన 'వికటకవి' డిటెక్టివ్ వెబ్ సిరీస్ ప్రస్తుతం జీ5లో స్ట్రీమింగ్ అవుతున్నది. నరేష్ ఆగస్త్య, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సందర్భంగా కాస్ట్యూమ్ డిజైనర్ గాయత్రి దేవి జోశ్యుల మాట్లాడుతూ 'నేను చెన్నైలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేశారు. మైక్రోసాఫ్ట్‌వంటి ప్రముఖ కంపెనీలో పనిచేశా. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి సినీరంగం వైపు అడుగులు వేశాను. 'కుడిఎడమైతే' సిరీస్ ద్వారా కాస్ట్యూమ్ డిజైనర్‌గా నా ప్రయాణం మొదలైంది' అని చెప్పింది. 'వికటకవి' సిరీస్ విశేషాల గురించి చెబుతూ 'ఇది తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. దీనికోసం 1940లో హైదరాబాద్ ఎలా ఉందో రీసెర్చ్ చేసి తెలుసుకున్నా. 'మాభూమి' సినిమా చూడటం వల్ల అప్పటి ప్రజల వేషధారణ, సంస్కృతిపై ఓ అవగాహన వచ్చింది. మరింత రిఫరెన్స్ కోసం లైబ్రరీలకు వెళ్లి ఆర్టికల్స్ చదివాను. ఆ సమాచారం ఆధారంగా కాస్ట్యూమ్ డిజైన్స్ సిద్ధం చేశా' అని పేర్కొంది. 'వికటకవి' టెక్నికల్‌గా తనకు మంచి ఎక్స్‌పీరియన్స్‌నిచ్చిందని, తదుపరి సతీష్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందిస్తున్న 'మర్మయోగి' వెబ్‌సిరీస్‌తో పాటు 'మానసచోర' అనే సినిమాకు పనిచేస్తున్నానని గాయత్రి దేవి జోశ్యుల తెలిపింది.

కిర్రాకు లవ్వు పుట్టినట్టు..

ధర్మ, ఐశ్వర్య జంటగా నటిస్తున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమాలోని 'బాగి బాగి..' అనే లిరికల్ సాంగ్‌ను శుక్రవారం విడుదల చేశారు. శ్రీవసంత్ స్వరపరచిన ఈ గీతాన్ని చంద్రబోస్ రచించగా, జావెద్ అలీ ఆలపించారు. 'సర్రంటు కరెంట్ షాక్ కొట్టినట్లు, నరాలు గుర్రాలై దౌడు తీసినట్లు, బుర్రంత గిర్రంటు సుట్టు తిరిగినట్టు..కిర్రాకు లవ్వు పుట్టినట్టు బాగి బాగి సూడరాదే కొంచెం ఆగి..' అంటూ యూత్‌ఫుల్‌గా ఈ పాట సాగింది. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశామని చిత్ర బృందం పేర్కొంది. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీవసంత్, రచన-దర్శకత్వం: కిరణ్ తిరుమలశెట్టి.

అర్జున్ మహాక్షయ్ పోరాటం

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మ్యాక్స్'. వరలక్ష్మీ శరత్‌కుమార్, సునీల్ కీలక పాత్రధారులు. విజయ్ కార్తికేయ దర్శకుడు. కలైపులి ఎస్ ధాను నిర్మాత. ఈ చిత్రం తెలుగులో డిసెంబర్ 25న విడుదల కానుంది. అర్జున్ మహాక్షయ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ఇందులో సుదీప్ కనిపించనున్నారని, సుదీప్ నట విశ్వరూపాన్ని ఆవిష్కరించే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. సంయుక్త హార్నడ్, సుకృతి వాగల్, అనిరుద్ భట్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: శేఖర్‌చంద్ర, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: వి.క్రియేషన్స్, కిచ్చా క్రియేషన్స్.